క్లుప్తంగా

జాతీయ లోక్ అదాలత్ రేపు

గజపతినగరం రూరల్: మండలంలోని జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి విజయ్‌రాజ్‌కుమార్ పోలీసులను, న్యాయవాదులను గురువారం ఓ ప్రకటనలో కోరారు.ఈలోక్ అదాలత్‌లో చెక్‌బౌన్స్, బ్యాంకు కేసులు, ప్రామిసరీ నోటులు, పర్మినెంట్ ఇంజెక్షన్ దావా, భూమి, కుటుంబ తగాదాలు, ఇతర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులకు అవగాహన కల్పించి, కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని న్యాయవాదులు, పోలీసులకు సూచించారు.

ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవు



సమావేశానికి హాజరైన బుక్ కీపర్లు

దత్తిరాజేరు: వెలుగు సమాఖ్య బుక్ కీపర్లపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని వెలుగు ఏపీఎం రమణ హెచ్చరించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో విలేజ్ బుక్ కీపర్లతో గురు వారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ గ్రామాల్లో నిఅన్ని డ్వాక్రా సంఘాలతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాలను సక్రమంగా వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించేలా సభ్యులకు అవగాహన కల్పించాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి మాల్కంబ్ పోటీలకు ఎంపిక



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయ సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి శ్రీరాం ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి మాల్కంబ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయనగరం పీఎస్ఆర్ పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. వీరిని హెచ్‌ఎం ఎం.నిర్మల, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.ఉదయ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తాం



ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మధుసూదనరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. పని ఒత్తిడి తగ్గించాలని, ఇంక్రిమెంట్లు వేయాలని, ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ నిర్మలా జ్యోతి

గజపతినగరం: వరి పంట మంచి దిగుబడులు రావాలంటే సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గజపతినగరం వ్యవసాయ శాఖ ఏడీఏ ఏ. నిర్మలా జ్యోతి రైతులకు సూచించారు. మండలంలోని లోగిశ గ్రామంలో వరి పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించారు. పంట చిరుపొట్ట దశలో ఎకరానికి యూరియా 25 కిలోలు, పొటాష్ 25 కిలోలు చొప్పున ఎకరానికి ఏడు నుంచి ఎనిమిది నిముషాల్లో డ్రోన్ ద్వారా పిచికారీ చేయా లని రైతులకు చెప్పారు. ఏడీఏ వెంట ఏఓ పి.కిరణకుమార్ ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మీసాల విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.వి.బి.సుబ్రహ్మణ్యం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు, పంచాయతీల ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పోడు వ్యవసాయం కరువు

- దయనీయంగా పోడువ్యవసాయం చేస్తున్న గిరిపుత్రుల పరిస్థితి
- కొత్త వంగడాల పంపిణీ ఊసేలేదు
- అందని రాయితీలు, ఇతర సౌకర్యాలు
- కష్టానికి తగ్గ ఫలితం దక్కడం లేదని గిరిపుత్రుల ఆవేదన





ధారపర్తి గిరిజన గ్రామంలో పొట్టదశలో ఉన్న మెట్ట వరిపైరు, (ఇన్‌సెట్లో) చిట్టంపాడులోని పోడుభూమిలో సాగులో ఉన్న చోడిపంట

శృంగవరపుకోట: గిరిసీమల్లో సేద్యం చేసే రైతులకు ప్రభుత్వం నుంచి సహాయం కరువవుతోంది.సారవంతమైన పోడు భూములు, కొండవాగుల్లో వచ్చే జలసిరులు వారికి ప్రకృతి ప్రసాదించిన వరాలు. కొండల్ని పిండికొట్టే సత్తా వారిది. సేద్యంపై తీరని మక్కువ వారికి. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న సామెత తీరుగా ప్రభుత్వం కరుణ కరువై, సేద్యంలో సాయం శూన్యమై గిరిపుత్రులు ఆవేదన చెందుతున్నారు. ఎస్.కోట మండలంలో ధారపర్తి, మూలబొడ్డవర, ఎస్.కోట పంచాయతీల్లో గిరిశిఖర గ్రామాల్లో, వేపాడ మండలంలోని వీలుపర్తి, కరకవలస, కొండగంగుబూడి పంచాయతీల్లోని గిరిజన గ్రామాల్లోని గిరిజనం పోడు వ్యవసాయం చేస్తున్నారు.మామిడి, జీడి, పనస పంటలతో పాటు ఆహార ధాన్యాలైన స్వల్పకాలిక వరి, చిరుధాన్యా లైన కొర్రలు, అరికెలు, సామలు, వరిగెలు, అండు కొర్రలు, జొన్నలు, గంటెలు, సజ్జలు, రాగులు, తదితర పంటలను పాత విత్తనాలతోనే పండిస్తు న్నారు. గిరిపుత్రులు తమ వద్ద ఎప్పుడో పూర్వం నుంచి సంప్రదాయ పద్ధతిన సాగు చేస్తున్న స్వల్పకాలిక రకాలైన వరి విత్తనాలతోనే సాగు చేస్తున్నారు. వారు సాగు చేసే పంట ఉత్పత్తుల్లో కొంత భాగాన్ని విత్తనాల కోసం దాచిపెట్టు కుంటూ, వాటితోనే మళ్లీ పంటలు సాగుచేసుకుంటూ వస్తున్నారు. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన స్వల్ప కాలిక వరి రకాలు, చిరు ధాన్యాల్లో కొత్త వంగడాలు, ఎరువులు, పురుగు మందులు గిరిపుత్రులకు ప్రభుత్వం నుంచి అందడం లేదు. పోడు పంటలను పరిశీలించి, సలహాలు, సూచనలు అందించేం దుకు వ్యవసాయశాఖ అధికారులు ఎవరూ రావడం లేదని గిరిపుత్రులు అంటున్నారు. ప్రభుత్వం నుంచి సహాయం, ప్రోత్సాహకాలు అందక పోతుండడంతో కష్టానికి తగ్గ ఫలితం పొందలేకపోతున్నామని గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాయితీలు, సదుపాయాలు కల్పిస్తే సిరుల పంటే..

పోడు వ్యవసాయం చేసుకునే గిరిజన రైతాంగానికి రాయితీపై విత్తనాలు అందడం లేదని, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహం లేదని గిరిజన సంఘ ప్రతినిధులు చెబుతున్నారు. రాయితీలు, సదుపాయాలు కల్పిస్తే గిరిజనులకు సిరుల పంటేనని గిరిజన సంఘ ప్రతినిధులు అంటున్నారు.రాయితీపై స్వల్పకాలిక వరి, చిరుధాన్యాల విత్తనాలు ఇవ్వాలని, పురుగు మందులు, ఎరువులు అందించాలని కోరుతున్నారు.గడ్డపారలు, గునపాలు, పారలు, కొడవళ్లతో పాటు పవర్ టిల్లర్లు, కొండగెడ్డల్లో నీటిని మళ్లించుకు నేలా హెచ్‌డీపీఈ పీవీసీ పైపులు, కిరోసిన్ ఇంజిన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్లు సబ్సిడీపై ఇవ్వాలని, వడ్డీ లేని వ్యవసాయ రుణాలు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కొండమట్టి కోరుకుపోకుండా రాక్‌ఫిల్ డ్యామ్‌లు, నీటి నిల్వకు చెక్‌డ్యామ్‌లను ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించాలని కోరుతున్నారు. ఈప్రాంతం సబ్‌ప్లాన్ ఏరియాలో లేనందున ఐటీడీఏ సంక్షేమ ఫలాలు తమకు అందడం లేదని, కనీసం వ్యవసాయానికైనా సాయం చేయాలని గిరిజన రైతులు కోరుతున్నారు.

విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



రాయితీపై ఎరువులు, పురుగు మందులు, మెట్ట వరి విత్తనాలు, చిరుధాన్యాల విత్తనాలు ఇవ్వాలి. వ్యవసాయ పని ముట్లు, యంత్రపరికరాలను రాయితీపై ఇచ్చి సాయం చేయాలి. వడ్డీ లేని వ్యవసాయ రుణాలు ఇప్పించాలి. గిరిసీ మల్లో పంటనుల అధికారులు తరచూ పరిశీలిస్తూ సాగు, సస్య రక్షణ, మార్కెటింగ్‌పై గిరిజన రైతులకు శిక్షణ ఇప్పించాలి.

– జె.గౌరీష్, ఏపీ గిరిజన సంఘం నేత

చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి



కొండమట్టి కోరుకు పోకుండా రాతి గట్లు నిలబెట్టాలి. కొండగెడ్డలు కొట్టుకుపోకుండా, నీరు పోకుండా పూర్వం మాదిరిగా చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి. నీరు ఉంటేనే పంటలు పండుతాయి. మాకు ఊతమిస్తే ఆరోగ్యమైన పంట ఉత్పత్తులు అందిస్తాం.

– జన్ని రమేష్, గిరిజన రైతు, చిట్టంపాడు గ్రామం

సాయం చేయాలి



పోడు వ్యవసాయం చేయాలంటే ప్రభుత్వం నుంచి సాయం కావాలి. పురుగు మందులు లేకున్నా పర్వాలేదు. కొండల్లో తక్కువదినాల్లో పండే మంచి వరి, చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలు ఉచితంగా ఇవ్వాలి. పంటలకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి.

– ఓలేసి చిన్నయ్య, గిరిజన రైతు, గూనపాడు గ్రామం

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



గర్భాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, తదితరులు

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు

మెరకముడిదాం: భాషా పండితులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గర్భాం జెడ్పీ పాఠశాల, గర్భాం ఏపీ మోడల్ స్కూల్, మెరకముడిదాం జెడ్పీ పాఠశాలలను ఆయన గురువారం సందర్శించారు. హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు ప్రభుత్వం టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నాన్‌టీచింగ్ స్టాఫ్‌తో పాటు డిజిటల్ అసిస్టెంట్లను, పీఈటీలను నియమించాలని కోరారు. పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు ప్రతినెలా 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆల్తి శ్రీహరిరావు, మంత్రి శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణ, ఎస్.సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

వేపాడ: మండలంలోని చలుమూరివానిపాలెంలో వేపాడ పశువైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. సిబ్బందితో కలిసి వైద్యాధికారి పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. వర్షాకాలంలో పశువులు, జీవాల సంరక్షణ, యాజమాన్య పద్ధతులపై పాడిరైతులు, జీవాల కాపరులకు అవగాహన కల్పించారు. పశుగ్రాసం పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు.

22 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు

చీపురుపల్లి: పట్టణంలోని ఆంజనేయపురంలోని మారుతీహరిహర క్షేత్రంలో ఈ నెల 22 నుంచి దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు ఆలయ అర్చకులు ఆరవెల్లి మణికంఠ శర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10.15 గంటలకు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అక్టోబర్ 2న విజయదశమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ నెల 29న అమ్మవారికి సరస్వతీ సహస్రనామార్చన పూజలు ఉంటాయన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పరిశీలన



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శిరీషారాణి

జామి: జాగరం గ్రామంలో డీఎల్‌పీఓ పి.శిరీషారాణి గురువారం పర్యటించారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణతో పాటు గ్రామంలోని చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీలో సేంద్రియ ఎరువు తయారీ, తడి, పొడి చెత్తను వేరు చేయడంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో తాగునీటి సరఫరా, క్లోరినేషన్ తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శి అనురాధను అడిగి తెలుసుకున్నారు.

బురదలో కూరుకుపోయిన 108 వాహనం



బురదలో కూరుకుపోయిన 108 వాహనం

దత్తిరాజేరు: మండలంలోని గొభ్యాం కూడలి వద్ద బీటీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతబారడంతో తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. ఈరోడ్డులో గురువారం సాయంత్రం 108 వాహనం కూరుకుపోవడంతో దానిని బయటకు తీసేందుకు సిబ్బంది నానా అవస్థలు పడ్డారు. 108 డ్రైవర్ వాహనాన్ని బయటకు తీసేందుకు శ్రమించినప్పటికీ ఫలితం లేకుండాపోవడంతో ట్రాక్టర్ సహాయంతో బయటికి తీశారు. అధికారులు స్పందించి కోతకు గురైన రోడ్డుకు త్వరగా మరమ్మతులు చేపడితే ఇలాంటి ఇబ్బందులు ఉండవని ఆ మార్గంలో ప్రయాణించే వారు అంటున్నారు.

ఎక్కడ విధులు నిర్వహించాలి 'బాబూ'..!

- శిథిలావస్థకు చేరిన ఏడీ, ఏఓ భవనాలు
- కొత్త భవనాలకు ప్రతిపాదనలు లేని వైనం
- రైతు సేవా కేంద్రంలో ఏడీ, ఏఓ కార్యాలయాలు



శిథిలావస్థకు చేరుకోవడంతో మూతపడిన ఏడీఏ కార్యాలయం

చీపురుపల్లి: చీపురుపల్లి మండల వ్యవసాయాధికారి కార్యాలయంతో పాటు సబ్ డివిజన్ స్థాయిలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల, నెలిమర్ల మండలాల రైతులకు సేవలందించాల్సిన వ్యవసాయశాఖ సబ్ డివిజనల్ సహాయ సంచాలకుడి(ఏడీఏ)కార్యాలయం శిథిలావస్థకు చేరాయి. కనీసం అధికారులు కూర్చొనేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి. ఇద్దరు అధికారులకు కార్యాలయాలు లేకపోవడంతో పట్టణంలోని వంగపల్లిపేటలో ఉన్న రైతు సేవా కేంద్రంలో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు.

రైతు భరోసా కేంద్రం నిర్వీర్యం చేసి...

గత ప్రభుత్వ హయాంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చి రైతులకు విలువైన సేవలు అందించిన రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేర్లు మార్చి ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆ భవనాలు కూడా పని లేక ఖాళీగా ఉండడంతో ఏడీఏ కార్యాలయంతో పాటు మండల వ్యవసాయాధికారి కార్యాలయంగా వినియోగించుకుంటున్నారు. ఆ భవనం లేకపోతే ఏడీఏ, ఏఓ కార్యాలయాలు ఎక్కడ నిర్వహించాలో తెలియక రోడ్డుపై ఉండాల్సిన పరిస్థితి దాపురించేది. శిథిలావస్థకు చేరిన కార్యాలయాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు కూటమి ప్రభుత్వం కనీసం ప్రతిపాదనలు సిద్ధం చేయలేదు. దీంతో ఎక్కడ విధులు నిర్వహించాలి 'బాబూ' అంటూ ఉద్యోగులు తలలుపట్టుకుంటున్నారు.

పరామర్శ



కేసలి అప్పలనారాయణను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గరికివలస మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేసలి అప్పలనారాయణ అనారోగ్యం బాధపడుతున్నారు. ఆయనను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వేగంగా కోలుకోవాలని అకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి సూర్యనారాయణ రాజు, మండలాధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం, జమ్ము స్వామినాయుడు, కెంగువ మధుసూదనరావు ఉన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాడ్డి శ్రీదేవి

మెరకముడిదాం: బాల్య వివాహాలు అనర్థదాయకమని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాడ్డిశ్రీదేవి అన్నారు. మండలంలోని భైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్‌శక్తి, మిషన్ వాత్సల్యాలపై ఆమె గురువారం అవగాహన కల్పించారు. సఖి, యువ, కిశోరీబాలికల గ్రూపులకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌పై చైతన్యం కలిగించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేసే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే బి.రాములమ్మ, అంగన్‌వాడీ టీచర్లు ఎస్.రాధ, ఆర్.సుజాత, ఎం.కృష్ణవేణి, బి.గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీఓ అచ్యుత



జామి: జామి హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

శృంగవరపుకోట: మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని ఐసీడీఎస్ పీఓ అచ్యుత అన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాల తో పాటు చట్టాలపై సంకల్ప్ క్యాంపెయిన్‌లో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ఆడపిల్లలకు చిన్నతనంతో వివాహం చేయడం వల్ల భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని చెప్పారు.పోక్సో,తదితర చట్టాల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ పి.వి.కృష్ణమూర్తి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరత్నం, లక్ష్మి, స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

గంట్యాడ: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి అన్నారు. మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే చైల్డ్‌లైన్ నంబర్ 1098కు సమాచారం ఇవ్వాలని చెప్పారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

జామి: మండలంలోని జామి,అలమండ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు మిషన్‌శక్తి- మిషన్ వాత్సల్య కార్యక్రమం, చట్టాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురువారం అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో, తదితర చట్టాలు, లైంగిక వేధింపులు, గుడ్ టచ్,బ్యాడ్‌టచ్, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాల గురించి వివరించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే మేలు



పంటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

గజపతినగరం: ప్రకృతి వ్యవసాయమే అన్ని విధాలా మేలని, రైతులు అంతా ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ రీజనల్ టెక్నికల్ ఆఫీసర్‌లు ప్రకాష్,మేరీ సూచించారు. మండలంలోని పాతశ్రీరంగరాజపురం గ్రామంలో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటలను గురువారం వారు పరిశీలించారు. జీవామృతాలు, కషాయా ల తయారీ, పిచికారీ చేసుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ పి.కిరణ్‌కుమార్, ఏపీ సీఎస్‌ఎఫ్ సిబ్బంది గొర్లె సత్తిరాజు,బాలి ఈశ్వరరావు, మునకాల త్రినాథమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో వ్యాధులు దూరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రాజు

వేపాడ: వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనం చేసేముందు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం ద్వారా చాలా వరకు వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సోంపురం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం బి.పి.ఎ.రాజు అన్నారు. పాటూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై బుధవారం ఆయన అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల హాజరు, తదితర రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాలను మెనూ ప్రకారం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు.ఆయన వెంట సీఆర్పీలు రాంప్రసాద్, డి.కోటేశ్వరరావు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొట్టాం విద్యార్థినులు

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం పి.వి.రామ్‌కుమార్ గురువారం తెలిపారు.

10తరగతి విద్యార్థినులు కొత్తలి తనూజ, శిరికి మహితలు ఈనెల 12వ తేదీ నుంచి 14 వరకు అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లా జట్టుతో పాటూ వెళ్లారని చెప్పారు. అలాగే గత నెల 29 నుంచి 31వ తేదీ వరకు ప్రకాశం జిల్లా లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు బి.మౌనిక, వై.హేమప్రియ, ఎం.అలేఖ్యలు హాజరయ్యారని తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం



మోడల్ స్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న వన్‌స్టాప్ కేంద్రం కౌన్సిలర్ రమాదేవి

కొత్తవలస: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వన్ స్టాప్ కేంద్రం కౌన్సిలర్ కె.రమాదేవి విద్యార్థులకు సూచించారు. స్థానిక ఉన్నతపాఠశాలతో పాటు అర్ధన్నపాలెం గ్రామ సమీపంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థినులకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వివిధ చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్లపై గురువారం అవగాహన కల్పించారు. పోక్సో, ఇతర రక్షణ చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ఐసీడీఎస్ సహాయ పీఓ బి.లక్ష్మీబాయి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, హెస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రమణమ్మ,కె.వెంకటలక్ష్మి, సీహెచ్.నాగమణి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉద్యానవనశాఖ అధికారి చంద్రశేఖర్

గజపతినగరం: రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు.మండలంలోని లోగిశ గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయిల్ పామ్‌సాగుపై అవగాహన కల్పించడం తో పాటు, పంట సాగుకు ఉద్యానవన శాఖ అందించే ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఈ పంట సాగుకు తక్కువ పెట్టుబడి, తక్కువ నీటి తడులు సరిపోతాయని చెప్పారు. మొక్కలు నాటిన అయిదేళ్ల తర్వాత పంట చేతికి వస్తుందని, అప్పటి వరకు అంతర పంటలు సాగు చేసుకుని ఆదాయం పొందవచ్చని అన్నారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గింజలకు మంచి ధర ఉందని వివరించారు. ఉద్యానవనశాఖ సిబ్బంది దీప్తి, వీఏఏలు రోజా, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ఖాతాల్లోకి మినీ గోకులాల నిధులు

- ఆవేదనలో రైతులు

గుర్ల: మండలంలోని జమ్ముకు చెందిన 17 మంది రైతులు 2019లో మినీ గోకులాలు నిర్మించారు. ప్రభుత్వం మినీ గోకులాలు నిర్మించిన వారికి నగదు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంది. దీనిని అనువుగా తీసుకున్న టీడీపీ నాయకులు రైతులు ఖాతాలో వేయాల్సిన నగదును అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ ఖాతాలో జమయ్యేలా చేసుకున్నారు. టీడీపీ నాయకుల ఖాతాలో సుమారుగా రూ.2 లక్షల వరకు నగదు జమైంది. దీంతో మినీ గోకులాలు నిర్మించిన పాడి రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఏపీఓ రత్నమాల వద్ద ప్రస్తావించగా మినీ గోకులాలు నిర్మించిన నగదు వెల్డర్ ఖాతాలో జమచేశామని, శుక్రవారం రైతులకు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.